


# కరపత్రం

SINCE 2014

మంగళవారం మార్చి 03, 2026 | సంపుటి : 2 | సంచిక : 143 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు :4



## రాహుల్‌ను ప్రధాని చేయడమే మన కర్తవ్యం

» అందుకోసం కలసికట్టుగా పనిచేద్దాం
» రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమం
» డిసిసి అధ్యక్షులు శిక్షణ శివిరం ముగింపులో సిఎం రేవంత్

వికారాబాద్,మార్చి2 :
లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యమని తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షులకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. దేశం కోసం రాహుల్ ప్రధాని కావాలని ఆయన ఆకాంక్షించారు. ఇందుకోసం మనమంతా కలసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. మోడీ వల్ల దేశానికి తీరని నష్టం జరుగుతోందన్నారు. రాషహుల్ ప్రధాని అయితేనే దేశానికి క్షేమమని అన్నారు. వికారాబాద్ వేదికగా తెలుగు రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా ముగింపు సమావేశం సోమవారం జరిగింది.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీతోపాటు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజా జీవితంలో తానెప్పుడూ పైరవీలు చేయలేదన్నారు. గతంలో ప్రజాసమస్యలపై గళం విప్పిన తనపై కేసులు నమోదు చేశారని గుర్తు చేసుకున్నారు. ఆదివారం సైతం తాను కోర్టుకు వెళ్లినట్లు చెప్పుకొచ్చారు. ఈ 19 ఏళ్లలో జడ్పీటీసీ నుంచి తాను సీఎం అయ్యానని గుర్తు చేసుకున్నారు. ఆ క్రమంలో పార్టీ పదవులు సైతం నిర్వహించానని చెప్పారు. ఎమ్మెల్యేగా తాను మంచి అనుభవం పొందానన్నారు. తనపై అనేక కేసులు పెట్టారని.. పరువు నష్టం దావాలు కూడా వేశారని పేర్కొన్నారు. దేశం కోసం, తమ కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలని పేర్కొన్నారు. సోనియా గాంధీ పేరుతోనే తెలంగాణలో అధికారంలోకి వచ్చామని వివరించారు. ఐదేళ్లు చేసిన పోరాటాల వల్ల రాహుల్ గాంధీ ప్రధాన ప్రతిపక్ష నేత అయ్యారని వివరించారు. దేశం కోసం రాహుల్ గాంధీ ప్రధాని కావాలన్నారు. దేశంలో అనేక సమస్యలపై రాహుల్ గాంధీ పోరాటం చేశారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. తెలంగాణ ఇచ్చిన నేతగా సోనియా పేరు చిరస్తాయిగా ఉంటుందని అన్నారు. త్యాగాలు చేసిన కుటుంబం వారిదని అన్నారు.

## కార్నీ పర్యటన వేళ.. భారత్-కెనడా మధ్య యురేనియం డీల్



ఇంటర్నెట్‌డెస్క్: భారత్-కెనడా మధ్య కీలక ఒప్పందం కుదిరింది. సోమవారం 2.6 బిలియన్ డాలర్ల విలువైన యురేనియం సరఫరా ఒప్పందం మీద రెండుదేశాలు సంతకాలు చేశాయి అలాగే సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందం పై చర్చలు జరిపేందుకు అంగీకారం కుదిరింది. హైదరాబాద్ హౌస్‌లో ప్రధాని నరేంద్రమోదీ, కెనడా ప్రధాని మార్క్ కార్నీ మధ్య జరిగిన సమావేశంలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు.
దేశంలో పౌర అణుఇంధన కార్యక్రమానికి నిరంతరాయ సరఫరాను కొనసాగించడమే ఈ డీల్ ఉద్దేశం. చిన్న రియాక్టర్లు, అధునాతన రియాక్టర్లపై కలిసి పనిచేయనున్నామని మోదీ తెలిపారు అలాగే 2026 చివరినాటికి సమగ్ర ఆర్థిక భాగస్వామ్య ఒప్పందంపై కొలిక్కి రావాలని రెండు దేశాలు నిర్ణయించుకున్నట్లు కార్నీ వెల్లడించారు.

### స్వామి వివేకానంద సూక్తిని గుర్తుచేసుకున్న కెనడా ప్రధాని

1893లో స్వామి వివేకానంద కెనడాలో పర్యటించిన విషయాన్ని మార్క్ కార్నీ గుర్తుచేసుకున్నారు."లేవండి.. మేల్కొనండి.. లక్ష్యం చేరేవరకు ఆగకండి" అన్న వివేకానంద

## చమురు ట్యాంకర్‌పై దాడి

- భారతీయ సిబ్బంది ఒకరు మృతి



న్యూఢిల్లీ,మార్చి2
గల్ఫ్ ఆఫ్ ఒమన్ లో ఓ చమురు ట్యాంకర్‌పై దాడి జరిగింది. డ్రోన్ బోట్‌తో ఈ దాడికి పాల్పడినట్లు ఒమన్ అధికారిక మీడియా వెల్లడించింది. ఈ ఘటనలో నౌకలోని సిబ్బందిలో ఒకరు మృతిచెందారు. ఆ వ్యక్తి భారతీయుడని తెలిసింది. దాడికి గురైన నౌకను ఎంకేడీ వ్యోమ్‌గా గుర్తించారు. దీనిపై మార్షల్ ఐలాండ్స్ జెండా ఉంది. ఒమన్ తీరానికి 52 నాటికల్ మైళ్ల దూరంలో ఈ నౌకపై దాడి జరిగిందని ఒమన్ మీడియా వెల్లడించింది. ఈ ఘటన కారణంగా నౌకలో భారీ పేలుడు సంభవించింది. ప్రధాన ఇంజిన్ రూమ్‌లో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి.దీంతో ఒకరు ప్రాణాలు కోల్పోయినట్లు ఒమన్ తెలిపింది. దాడి సమయంలో నౌకలో 59,463 మెట్రిక్ టన్నుల చమురు ఉన్నట్లు తెలుస్తోంది. అయితే, ఈ దాడి ఎవరు చేశారన్న దానిపై స్పష్టత లేదు. పశ్చిమాసియా దేశాలపై ఇరాన్ దాడుల వేళ ఈ ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.నౌకలోని మిగతా 21 మంది సిబ్బందిని రక్షించి మరో కమర్షియల్ ఓడలోకి తరలించారు. వీరిలో 16 మంది భారతీయులు, నలుగురు బంగ్లాదేశీలు, ఒక ఉక్రెయిన్ జాతీయుడు ఉన్నారు. దాడి నేపథ్యంలో గల్ఫ్ ఆఫ్ ఒమన్ మీదుగా ప్రయాణించే నౌకలకు ఒమన్ మారిటైమ్ సెక్యూరిటీ సెంటర్ అలర్ట్ జారీ చేసింది.



## విజయ్ దంపతులకు కలెక్టర్ అభినందన

### జ్ఞాపిక బహుకరణ

నాగర్ కర్నూలు,మార్చి2 :
సినీ హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందాన నూతన దంపతులకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ దంపతులు కలిసి అభినందించారు. బల్మూరు మండలం తుమ్మన్ పెట్ గ్రామంలో సోమవారం నిర్వహించిన సత్యనారాయణ వ్రతంలో నూతన దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు.

మిగతాది 2లో

## క్రీడాకారులకు ఆర్థిక సాయం, ఇతర ప్రోత్సాహకాల అందచేత

» క్రీడాకారులను ప్రోత్సహించేందుకు కట్టుబడి ఉన్నాం
» ప్రతిభ కనబరిచిన వారికి ప్రభుత్వం అండ
» మంత్రి వాకిటి శ్రీహరి సమీక్ష



హైదరాబాద్,మార్చి2 :
క్రీడాకారులను ప్రోత్సహించేందుకు ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, మత్స్య, యువజన సర్వీసులు, క్రీడల మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. 2026-2027 బడ్జెట్ లో క్రీడాకారులకు ఆర్థిక సహాయం, ఇతర వసతులపై డా. బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో మంత్రి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఆ రాష్ట్ర ప్రభుత్వం నూతన క్రీడా పాలసీ తీసుకు వచ్చి క్రీడలను అభివృద్ధి చేయాలనే సంకల్పంతో ముందుకు సాగుతుందని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణను ఆటల్లో అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని మంత్రి వివరించారు. అందులో భాగంగా క్రీడా శాఖకు 2026-2026 బడ్జెట్ లో అధిక నిధుల కేటాయింపుతో పాటు, క్రీడాకారులకు ఆర్థిక సహాయంపై అధికారులతో చర్చించారు.

మిగతాద్ది 2 లో



## జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై వాదనలు

- విచారణ నేటికి వాయిదా వేసిన హైకోర్టు

హైదరాబాద్,మార్చి2
జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై తెలంగాణ హైకోర్టులో సోమవారం విచారణ జరిగింది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవకతవకలకు సంబంధించి జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చిన సంగతి తెలిసిందే.

2లో..

## ఇగోలు పక్కన పెట్టి పనిచేయండి

- ఒక్కొక్కరు మరో పదిమంది లీడర్లను తయారు చేయాలి
- మార్షల్ ఆర్ట్స్ రూపంలో క్లాస్ చెప్పిన రాహుల్ గాంధీ
- రాహుల్‌ను ప్రత్యేకంగా కలిసిన సీతక్క



2లో..

వికారాబాద్,మార్చి2 :
ఇగోల కంటే పార్టీ ముఖ్యమని స్పష్టం రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. పార్టీ కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. డీసీసీ అధ్యక్షులు.. మరో పదిమందిని తయారు చేయాలని, పని చేస్తున్న వారిని గుర్తించాలని రాహుల్ గాంధీ వెల్లడించారు. ఇండియా ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐసీసీ అగ్రనేత వివరించారు. డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతులు విజయవంతంగా ముగిశాయి. అనంతగిరి హరితా రిసార్ట్స్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమంలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా.. మార్షల్ ఆర్ట్స్ చేస్తూ డీసీసీ అధ్యక్షులకు క్లాస్ చెప్పారు రాహుల్. జియు జిట్సు అనే మార్షల్ ఆర్ట్‌లో మెళకువలను డీసీసీ అధ్యక్షులకు వివరించారు. మార్షల్ ఆర్ట్స్‌ను వ్యక్తిగత జీవితంలో అన్వయించుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ఐడియాలజీపై క్లాస్ చెప్పారు. నాయకులు తమ అహంకారాన్ని పక్కన పెట్టి పని చేయాలని రాహుల్ సూచించారు. పాకిస్థాన్‌కు చైనా మద్దతు ఇస్తోందని.. ఇరాన్ వెనక చైనా, రష్యా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు.



## స్టాక్ మార్కెట్లపై యుద్ధం ప్రభావం

» తీవ్రంగా నష్టపోయిన సూచీలు

ముంబయి,మార్చి1 :
ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు కొనసాగుతున్న నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు భారీగా నష్టపోయాయి. అంతర్జాతీయ మార్కెట్ల ప్రతికూల సంకేతాలు, చమురు రేట్ల పెరుగుదలతో సూచీలు దారుణంగా పడిపోయాయి.

## బాన్సువాడ ఘటన దురదృష్టకరం

» హిందువులంతా ఐక్యంగా పోరాడాలి
» హైడ్రా పేరుతో పేదల ఇళ్లు కూల్చేస్తున్నారు
» ఖమ్మంలో పేదల ఇళ్లను కూల్చి రోడ్డున పడేశారు
» కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శలు



మిగతాది 2లో

కామారెడ్డి,మార్చి2 :
హిందూ ధర్మ పరిరక్షణ కోసం అందరం కలిసి పోరాడాల్సిన సమయం వచ్చిందని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. ఇటీవల బాన్సువాడలో జరిగిన ఘటన దురదృష్టకరమని చెప్పారు. కామారెడ్డిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా పేరుతో పేదల ఇళ్లను ప్రభుత్వం కూల్చేస్తోందని బండి సంజయ్ ఆరోపించారు. పెద్దలతో బేరసారాలు కుదుర్చుకుని వారి జోలికి వెళ్లడం లేదన్నారు. మూసీ ఒడ్డున గాంధీ విగ్రహం పేరిట, ఖమ్మంలోని భూదాన్ భూముల్లో పేదల ఇళ్ల కూల్చివేతలు చేపట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బఫర్ జోన్‌లో ఎన్ని ఇళ్లున్నాయి? ఎన్ని కూల్చారు? అనే దానిపై చర్చకు సిద్ధమా? అని బండి సంజయ్ ప్రశ్నించారు.

కరపత్రం

తెలుగు దిన పత్రిక

మంగళవారం మార్చి 03, 2026


# క్రీడాకారులకు ఆర్థిక సాయం,

## » ఇతర ప్రోత్సాహకాల అందచేత

మొదటిపేజీ తరువాయి

ఒలంపిక్, పారా ఒలంపిక్, అంతర్జాతీయ, జాతీయ ఆటల పోటీల్లో పతకాలు సాధిందించిన వారికి ఆర్థిక సహాయం అందించేలా బ్జడెట్ లో కేటాయింపులు ఉండేలా ప్రతిపాదనలు పంపాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పాఠశాల విద్య నుంచి యూనివర్సిటీ స్థాయి వరకు ఆటల్లో ప్రతిభ కనబరుస్తున్న వారికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేస్తుందని చెప్పారు. ప్రభుత్వ ప్రోత్సహంతోనే విద్యార్థి, యువకులు క్రీడల్లో రాణిస్తారని మంత్రి వాకిటి శ్రీహరి వివరించారు. క్రీడాకారులకు ఇచ్చే పారితోషికాలపై విధివిధానాలు రూపొందించాలని, వాటిని నిష్పక్షపాతంగా అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఓఆ సోనీ బాలాదేవి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# స్టాక్ మార్కెట్లపై యుద్ధం ప్రభావం

మొదటిపేజీ తరువాయి

సెన్సెక్స్ 1000 పాయింట్లు నష్టపోయింది. నిఫ్టీ 300 పాయింట్ల మేర పడిపోయింది. సోమవారం ఉదయం 9.25 గంటల సమయంలో సెన్సెక్స్ 1,048.48 పాయింట్లు దిగజారింది. దీంతో 80,238.71 వద్ద, నిఫ్టీ 307.35 పాయింట్లు పతనమై 24,871.30 వద్ద కొనసాగుతున్నాయి. రూపాయి విలువ క్షీణించింది. నేటి సెషన్‌లో 24 పైసలు తగ్గింది. దీంతో 91.32గా ట్రేడ్ అవుతోంది. ప్రీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 2,700 పాయింట్లు, నిఫ్టీ 530 పాయింట్లు కుంగడంతో ఇన్వెస్టర్లు తీవ్ర ఆందోళన చెందారు. ప్రస్తుతం మార్కెట్లు కొద్దిగా కోలుకున్నప్పటికీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. ఇరాన్-అమెరికా యుద్ధంతో అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు రేట్లు భగ్గుమన్నాయి. ముడి చమురు ధర 80 డాలర్లపైగా ట్రేడ్ అవుతోంది. దీని ప్రభావంతో దేశీయంగా చమురు రంగ షేర్లు బాగా పడిపోయాయి. ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ 5 శాతం మేర కుంగింది. మారుతి సుజుకీ, ఏషియన్ పెయింట్స్ వంటి షేర్లు తీవ్ర నష్టాల్లో కొనసాగుతున్నాయి. క్రితం సెషన్‌లో విదేశీ సంస్థాగత మదుపర్లు రూ.7536 కోట్ల విలువైన ఈక్విటీలను అమ్మారు. ఇది కూడా మార్కెట్ సెంటిమెంట్‌పై ప్రతికూల ప్రభావం చూపింది.

# విజయ్ దంపతులకు కలెక్టర్ అభినందన

మొదటిపేజీ తరువాయి

ఈ సందర్భంగా కలెక్టర్ దంపతులు జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. తమ అభిమాన నటులు సొంత ఊరిలో ఇంత సాదాసీదాగా, సంప్రదాయబద్ధంగా వేడుకలు జరుపుకోవడం చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని వీధులన్నీ జనంతో కళకళలాడాయి.స్టార్ కపుల్ రాక నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. వారి నివాసం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. ముందస్తు పాసులు ఉన్న వారినే లోపలికి అనుమతిస్తున్నారు. అచ్చంపేట డీఎస్పీ ప్లలె శ్రీనివాస్ నేతృత్వంలో సీఐ నాగరాజు, బల్మూరు ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

# ఇగోలు పక్కన పెట్టి పనిచేయండి

మొదటిపేజీ తరువాయి

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు మోదీ పూర్తిగా సరెండర్ అయ్యారని.. ట్రంప్‌కు వ్యతిరేకంగా మోదీ పని చేయలేరని రాహుల్ గాంధీ వ్యాఖ్యానించారు. డీసీసీ అధ్యక్షుల శిక్షణా తరగతులు ముగియడంతో వికారాబాద్ నుంచి హెలికాప్టర్‌లో శంషాబాద్ వెళ్ళారు. అక్కడి నుంచి ఏఐసీసీ అగ్రనేత ఢిల్లీకి బయలుదేరి వెళతారు. ఇదిలావుంటే లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ వికారాబాద్ పర్యటన సందర్భంగా రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క మర్యాదపూర్వకంగా కలిశారు. వికారాబాద్ జిల్లా అనంతగిరి కొండల్లోని హరిత రిసార్ట్స్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ డీసీసీ అధ్యక్షుల 10 రోజుల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి రాహుల్ గాంధీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క ఆయనతో రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిస్థితులు,ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ బలోపేతంపై చర్చించినట్లు తెలిసింది.

# బాన్సువాడ ఘటన దురదృష్టకరం

మొదటిపేజీ తరువాయి

ఏఐసీసీ అగ్రనేత, లోక్సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ హైదరాబాద్ పర్యటనపై బండి సంజయ్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. ఆయన పర్యటన పాకెట్ మనీ కోసమేనా అని ప్రశ్నించారు. గాంధీ కుటుంబానికి కాంగ్రెస్ రూ.10 వేలకోట్లు ఇవ్వ గలదని సీఎం రేవంత్ రెడ్డే చెప్పారన్నారు. ఒక్క తెలంగాణ నుంచే వెయ్యి కోట్లు గాంధీ కుంబానికి వెళ్తాయని ఆరోపించారు. కామారెడ్డి బాన్సువాడలో జరిగిన కలహాలలో జైలుకి పోయిన బాధితుల కుటుంబ సభ్యులను బండి సంజయ్ పరామర్శించారు. ముఖ్యమంత్రి బలిసినోడిని వదిలి పెట్టి నిరుపేదల జోలికి పోతున్నారు. రాహుల్ గాంధీ చేస్తున్నది రాజకీయ పర్యటనా? లేక కలెక్షన్ల సమీక్షనా? అని రాష్ట్రం చూస్తుందని అన్నారు. హైదరాబాద్ లో ఫాతిమా కళాశాలను వదిలి పెట్టి ఖమ్మంలో కళాశాలలను కూల్చిన గొప్పతనం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిది. రాష్ట్ర ముఖ్యమంత్రి పేదల జోలికి వస్తే అదే బోల్డోజర్లు తీసుకుని నీపైకి వస్తాం. గడిచిన ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన హామీలు అమలు చేయక పోయినా కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి మనం తీసుకున్న తప్పుడు నిర్ణయం వల్లనే మనం ఈ గోస పడుతున్నాం. వచ్చే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో మనం ఆలోచించి ఓటు వేయాలి. కామారెడ్డిలో జరుగుతున్న అన్యాయాలపై ప్రశ్నిస్తే ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణా రెడ్డిపై దాడి చేశారు. కాంగ్రెస్ పార్టీ దాడులు చేస్తే మేము సహించి ఊరుకోవడానికి బిఆర్ఎస్ నాయకులం కాదు. దేశంలో 20 రాష్ట్రాల్లో మేము అధికారంలో ఉన్నాం. అరాచకాలు, కూల్చివేతలు వెంటనే మానండి, ఇలాంటివి పునరావృతం అయితే మా ప్రణాళిక మేము సిద్ధం చేసుకుంటాం. గత 9 రోజులుగా వికారాబాద్ జిల్లా అనంతగిరి గుట్టల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన డీసీసీ అధ్యక్షుల శిక్షణ శిబిరం కొనసాగు వేశంలో పాల్గొని డీసీసీ అధ్యక్షులు,
ముఖ్య నేతలకు దిశా నిర్దేశర చేసేందుకు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్గాంధీ ఇక్కడికి వచ్చారు. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి ప్రణాళిక బద్ధంగా తీసుకోవాల్సిన చర్యలు, పార్టీ కా ర్యక్రమాల నిర్వహణ తదితర అంశాలపై వారితో చర్చించారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ రాహుల్ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు సంచలనంగా మారాయి.

# దాడిలో గాయపడ్డ ఖమేని భార్య మృతి

# ఇరాన్ అధికారిక వార్తా సంస్థ వెల్లడి

అమెరికా మద్దతుతో ఇజ్రాయెల్ గత శనివారంనాడు తొలిసారి టెహ్రాన్‌పై జరిపిన దాడుల్లో తీవ్రంగా గాయపడిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ భార్య మన్సూరే ఖోజాస్తే సోమవారంనాడు మరణించినట్టు ఆదేశ అధికారిక వార్తా సంస్థ తెలిపింది. ఖమేనీ నివాసంపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఇప్పటికే ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, మనుమరాలు మృతి చెందారు. ఖమేనీ మృతితో ఇప్పటికే ఉద్రిక్తతలు చోటుచేసుకోగా, మన్సూర్ ఖోజాస్తే కూడా మరణించడంతో టెహ్రాన్ నాయకత్వంపై ఒత్తిడి పెరిగి ఉద్రితకలు మరింత పెరిగే అవకాశాలున్నాయనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.సామ్రాజ్రవాద శక్తుల దాడులను భీకరంగా తిప్పికొడతామని ఇప్పటకే ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ) ప్రకటించింది. అమెరికా స్థావరాలే లక్ష్యంగా అమెరికా మిత్రదేశాలుగా ఉన్న గల్ఫ్ దేశాలపై ఇరాక్ వరుసదాడులు జరుపుతోంది. దీంతో తక్షణమే ఇరాన్ దాడులు ఆపాలంటూ 6 గల్ఫ్ దేశాలు సోమవారంనాడు ఒక సంయుక్త ప్రకటన చేశాయి. ఇరాన్ దాడులు ప్రాంతీయ భద్రతకు ముప్పుగా పరిణమించనున్నట్టు తెలిపాయి. యుద్ధం పొరుగుదేశాలతో కాదని, తెలివి తెచ్చుకోవాలని యూఏఓ హెచ్చరించగా, దాడులు ఆపకపోతే ఎలా రక్షించుకోవాలో తమకు తెలుసునంటూ ఆ సంయుక్త ప్రకటన పేర్కొంది. ఇజ్రాయెల్ సైతం ఇరాన్‌తో పాటు లెబనాన్‌కు దాడులను విస్తరించింది. హిజ్బుల్లా ఉగ్రవాద సంస్థ ఇజ్రాయెల్ భూభాగంపై రాకెట్లు, డ్రోన్లతో దాడులకు పాల్పడటంతో ఇజ్రాయెల్ సైన్యం సైతం యుద్ధం దీర్ఘకాలం జరిగే అవకాశాలుంటాయని హెచ్చరించింది. సూయజ్ కాలువ గుండా జరిగే షిప్పింగ్‌ను కొన్ని కంపెనీలు ఇప్పటికే సస్పెండ్ చేశాయి. మధ్యప్రాచ్యంలోని పలు దేశాలు తమ గగనతలాన్ని మూసివేశాయి. మరోవైపు, ఇరాన్‌లో యుద్ధం ఇరాక్ తరహాలోనే ముగింపు లేని యుద్ధం కావచ్చనే అభిప్రాయాలను అమెరికా రక్షణ కార్యదర్శి పీటె హెగ్సెత్ తోసిపుచ్చారు. ఇరాక్‌తో పోల్చవద్దని, ఇది ఎంతమాత్రం ముగింపలేని యుద్ధం కాదని, ఇరాన్ సైనిక శక్తిని ధ్వంసం చేసేందుకు చేపట్టిన నిర్ణయాత్మకమైన దాడి అని చెప్పారు.

# పశ్చిమాసియా ఘటనలతో ఉద్రిక్తత

# అరబ్ ఎమిరేట్స్ అధ్యక్షుడికి మోడీ ఫోన్

న్యూఢిల్లీ: ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ సైనిక చర్య, ఇందుకు ప్రతిగా ఇరాన్ జరుపుతున్న దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్
దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ఇరాన్ క్షిపణలు, డ్రోన్ దాడులపై విరుచుకుపడుతుండటం పరిస్థితిని మరింత తీవ్రం చేస్తోంది. ఈ నేపథ్యంలో సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్ మహమ్మద్ బిన్ సల్మాన్ అల్ సౌద్, బహ్రెయిన్ రాజు హమద్ బిన్ ఇసా అల్ ఖలీఫాకు భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోమవారంనాడు ఫోను చేశారు. ఇరువురు నేతలతో సంభాషణల్లో సౌదీ అరేబియా, బహ్రెయిన్‌పై ఇరాన్ జరుపుతున్న దాడులను మోదీ ఖండించారు. రెండు దేశాల్లోని భారతీయుల భద్రతపై ఆరా తీశారు. కాగా, దీనికి ముందు పశ్చిమాసియాలో ఉద్రిక్తతలపై ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో మోదీ ఫోనులో మాట్లాడారు. ఉద్రిక్తతలపై ఆందోళన వ్యక్తం చేశారు. పౌరుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఘర్షణలను సాధ్యమైనంత త్వరగా ముగించాల్సిన అవసరాన్ని పునరుద్ఘాటించారు. ఆదివారం రాత్రి భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ భేటీకి కూడా మోదీ అధ్యక్షత వహించారు. పశ్చిమాసియాలో ఘర్షణల వల్ల తలెత్తిన పరిణామాల, ఆయా దేశాల్లో చిక్కుకుపోయిన భారతీయుల భద్రతపై సమావేశంలో చర్చించారు.
సంభాషణకు సంబంధించి ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా కీలక విషయాలను పంచుకున్నారు. యూఏఈ అధ్యక్షుడిని తన 'సోదరుడు' అని సంబోధిస్తూ, అక్కడ జరిగిన దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ముఖ్యంగా యూఏఈలో నివసిస్తున్న భారతీయ సమాజం భద్రత పట్ల ఆ దేశం చూపుతున్న శ్రద్ధకు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఉద్రిక్తతలను తగ్గించి, శాంతియుత వాతావరణాన్ని పునరుద్ధరించడానికి భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు, ప్రధాని మోదీ అధ్యక్షతన న్యూఢిల్లీలో భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ అత్యవసరంగా భేటీ అయ్యింది. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీ మరణం తర్వాత పశ్చిమాసియాలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై ఈ సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడుల వల్ల ప్రపంచవ్యాప్తంగా తలెత్తే రాజకీయ మరియు ఆర్థిక సవాళ్లను ఎదుర్కోవడానికి తీసుకోవాల్సిన వ్యూహాత్మక నిర్ణయాలపై ఈ కమిటీ కసరత్తు చేసింది. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, అమిత్ షా, ఎస్. జైశంకర్ మరియు నిర్మలా సీతారామన్ పాల్గొన్నారు. దేశ భద్రతకు సంబంధించి అత్యున్నత నిర్ణయాలు తీసుకునే ఈ కమిటీ, ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ అనుసరించాల్సిన విదేశాంగ విధానం మరియు అంతర్జాతీయ వేదికలపై వినిపించాల్సిన స్వరంపై స్పష్టతనిచ్చింది. యుద్ధం వల్ల భారత ఆర్థిక వ్యవస్థపై పడే ప్రభావాన్ని కనిష్ఠం చేసేలా తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించింది.

# జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై వాదనలు

మొదటిపేజీ తరువాయి

ఈ రిపోర్ట్ ను రద్దు చేయాలంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. కేసీఆర్, హరీశ్ రావు, ఎస్కే జోషి, ఐఏఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ దాఖలు చేసిన ఈ పిటిషన్లపై ఇవాళ ఉన్నత న్యాయస్థానం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ప్రభుత్వం తరఫున ప్రముఖ న్యాయవాది అభిషేక్ సింఘ్వి, జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తరఫున నిరంజన్ రెడ్డి వాదనలు వినిపించారు.
పీసీ ఘోష్ కమిషన్ రిపోర్ట్‌పై అభ్యంతరం వ్యక్తం చేస్తూ కేసీఆర్ తరుపున లాయర్లు వాదనలు వినిపించారు. సాక్షులు ఎవరైనా పిటిషనర్ కు వ్యతిరేకంగా స్టేట్మెంట్ ఇస్తే అప్పుడు నోటీస్ జారీ చేసి వారి వాదన వినాలని చట్టం చెబుతుందని కేసీఆర్ తరఫు న్యాయవాది వెల్లడించారు. నివేదికలో తీవ్ర ఆరోపణలు
చేయడం , పిటిషనర్ పరువు, కీర్తికి నష్టం కలిగేలా చేయడం సరైంది కాదని హైకోర్టుకు తెలిపారు.
దే సమయంలో ప్రభుత్వ తరఫు న్యాయవాదులు కూడా పలు అంశాలను ప్రస్తావించారు. 'కాళేశ్వరం ప్రాజెక్టులో ఏం జరిగిందో తెలుసుకునే హక్కు ప్రభుత్వానికి ఉంది. కేసీఆర్, హరీశ్ రావుకు విచారణ కమిషన్ తగిన అవకాశం ఇచ్చింది. తన విధులు నిర్వహించడం లో స్మిత సబర్వాల్ విఫలం అయ్యారని నివేదిక లో ఉంది' అని ప్రభుత్వం తరఫు లాయర్లు హైకోర్టు ధర్మాసనంకు తెలియజేశారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు తదుపరి విచారణను మంగళవారం మధ్యాహ్నం 2.15 కి వాయిదా వేసింది.

# కుమ్మెలర ఘటనపై కలెక్టర్ నివేదిక

## - బిసి కమిషన్‌కు సమర్పించినట్లు వెల్లడి

తెలంగాణ బీసీ కమిషన్ గత నెల 23వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్‌ను కుమ్మెర జాతర సంఘటనకై నివేదిక కోరడం జరిగింది. కమిషన్ ఛైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి రంగు బాలలక్ష్మి 24వ తేదీన కుమ్మెర గ్రామాన్ని సందర్శించి వివరాలు తెలుసుకోవడం జరిగింది. నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బధ్వావత్ సంతోష్ పంపిన తమ నివేదిక బీసీ కమిషన్‌కు చేరింది. అందులో పాప తండ్రి గణెళిష్‌కు డిస్ట్రిక్ అడ్మినిస్ట్రేటివ్ ఫండ్ నుండి ఒక లక్ష రూపాయలు ఇవ్వడం జరిగింది. పాప తండ్రి గణెళిష్‌కు నాగర్‌కర్నూల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజిలో అవుట్‌సోర్సింగ్ జాబ్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. పాప తండ్రి గణెళిష్‌కు 2 పడకల గదిని ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.జిల్లా కలెక్టర్ పాప కుటుంబంతో మాట్లాడి, అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ రిపోర్టులో 18వ తారిఖునాడు కుమ్మెర మల్లన్న జాతర నుండి 21వ తారీఖు వరకు జరిగిన అన్ని సంఘటనలను కూలంకుషంగా వివరించడం జరిగింది. 17 ఫిబ్రవరి నుండి 20 ఫిబ్రవరి వరకు ఆ జాతరలో సుమారు 20 వేల భక్తులు పాల్గొన్నారని తెలపడం జరిగింది. పాప తల్లి శ్రీమతి మౌనిక కులాన్ని నిర్ధారించడానికి ఆధారంగా ఆమె ఎటువంటి సర్టిఫికేట్లు ఇప్పటివరకు అందజేయలేదని తెలిపారు. శ్రీమతి మౌనిక కులాన్ని నిర్ధారించడానికి మహమ్మదాబాద్ తహశీల్‌దార్‌కు ఆదేశించగా మౌనిక తల్లి బాలక్రిష్ణమ్మ పిచ్చగుంట్ల (వంశరాజ్) కులానికి చెందినదని తెలపడం జరిగింది.

# విజయ్ దంపతులకు కలెక్టర్ అభినందన

సినీ హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ రష్మిక మందాన నూతన దంపతులకు నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ దంపతులు కలిసి అభినందించారు. బల్మూరు మండలం తుమ్మన్ పెట్ గ్రామంలో సోమవారం నిర్వహించిన సత్యనారాయణ వ్రతంలో నూతన దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ దంపతులు జ్ఞాపికను అందజేసి అభినందనలు తెలిపారు. తమ అభిమాన నటులు సొంత ఊరిలో ఇంత సాదాసీదాగా, సంప్రదాయబద్ధంగా వేడుకలు జరుపుకోవడం చూసి అభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. గ్రామంలోని వీధులన్నీ జనంతో కళకళలాడాయి.స్టార్ కపుల్ రాక నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టం చేశారు. వారి నివాసం వద్ద ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది కఠిన ఆంక్షలు అమలు చేస్తున్నారు. ముందస్తు పాసులు ఉన్న వారినే లోపలికి అనుమతిస్తున్నారు. అచ్చంపేట డీఎస్పీ ప్లలె శ్రీనివాస్ నేతృత్వంలో సీఐ నాగరాజు, బల్మూరు ఎస్సై రాజేందర్ ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు.

# ఎసిబికి చిక్కిన జూనియర్ అసిస్టెంట్

మేడ్చల్ జిల్లా కుతుబుల్లాపూర్ తహసీల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న గణెళిష్ లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డాడు. ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికేట్ కోసం తహసీల్ కార్యాలయాన్ని సంప్రదించిన బాధితుడికి జూనియర్ అసిస్టెంట్ రూ.20 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో మొదటి విడతగా రూ.5 వేలు తీసుకోగా చివరి విడతగా సోమవార రూ.15 వేలు లంచం తీసుకుంటూ సిటీ రేంజ్ వన్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి నాంపల్లి కోర్టులో హాజరుపరిచారు.

# రైతులకు ప్రభుత్వం శుభవార్త

## పెండింగ్ విద్యుత్ కనుక్షన్లకు ఆమోదం

కూటమి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో ఏపీలో రైతులకు ఊరట లభించింది. పెండింగ్‌లో ఉన్న 46,113 వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అందుకు సంబంధించిన ఆదేశాలు సోమవారం జారీ చేసింది. ఈ నెలాఖరులోగా అనుమతులు జారీ చేయాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేసింది. మొత్తం పెండింగ్ దరఖాస్తులు: 46,113 ఉండగా.. వీటికి రూ.250 కోట్ల మేర ఖర్చు అవుతుందని అంచనా వేస్తున్నారు. రాష్ట్రంలో వ్యవసాయ కనెక్షన్లు మొత్తం 22.30 లక్షలు ఉన్నాయి. కొత్తగా ఇప్పటికే 1.12 లక్షల కనెక్షన్లు మంజూరు చేసింది. పెండింగ్‌లో ఉన్నవి క్లియర్ చేయడానికి మరో 10,000 ట్రాన్స్‌ఫార్మర్లు కేటాయించనుంది. ఈ పెండింగ్‌లో ఉన్న కనెక్షన్లను రెండు నెలల్లో పూర్తి చేయాలని డిస్కంలను విద్యుత్ శాఖ మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో సాగు సీజన్‌కు ముందే వేలాది మంది రైతులకు విద్యుత్ సౌకర్యం లభించే అవకాశం ఉందనే ఒక చర్చ సాగుతోంది.

# జల్లికట్టులో తీవ్ర విషాదం

## - ఎద్దు పొడవడంతో ముగ్గురు దుర్మరణం

శివగంగై జిల్లాలో ఏర్పాటు చేసిన జల్లికట్టులో తీవ్ర విషాదం నెలకొంది. సోమవారం జరిగిన ఈ క్రీడలో ఎద్దు పొడవడంతో ముగ్గురు మరణించారు. మరో 50 మందికిపైగా గాయపడ్డారు. స్థానికుల సహాయంతో వారందరినీ పోలీసులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వారిలో 15 మంది పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు వెల్లడించారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. జల్లికట్టు సందర్భంగా సరైన భద్రతా చర్యలు చేపట్టలేదని.. అందువల్లే ఇలా జరిగిందంటూ స్థానికులతో పాటు బాధిత కుటుంబాలు ఆరోపిస్తున్నాయి. మరో వైపు ఈ ఘటనలో మరణించిన వారి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యులు ఇప్పటికే ఆసుపత్రికి చేరుకున్నారు. తమిళనాడులో జల్లికట్టు పోటీలను సంప్రదాయ క్రీడగా ప్రజలు జరుపుకొంటారు. ఈ క్రీడలను చూసేందుకు ఏపీ, తెలంగాణ ప్రజలు భారీగా తమిళనాడుకు తరలివస్తారు. పరుగులు తీస్తున్న పశువులను పట్టుకోవడానికి యువకులు ఉత్సాహంగా పోటీపడి పరుగెడతారు. ఇలాంటి సమయంలో కొన్నిసార్లు ఇలాంటి ప్రమాదాలు చోటు చేసుకుంటుంటాయి.

# ముగిసిన కాంగ్రెస్ పార్టీ శిక్షణ తర్ఫిదు

» రాహుల్ గాంధీకి స్వాగతం పలికిన స్పీకర్, మంత్రుల
» పోలీసుల కట్టుదిట్టమైన భద్రతా మధ్య సమావేశం
» కాంగ్రెస్ శ్రేణులతో పోటోలు దిగిన రాహుల్





**కరపత్రం ప్రతినిధి వికారాబాద్, మార్చి:2,**
వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ కీలక రాజకీయ కార్యక్రమాలు సంఘటన సృజియన్ అభియాన్ పేరుతో ఘనంగా శిక్షణ తరగతులు ఘణంగా ముగిశాయి. రాహుల్ గాంధీ వికారాబాద్ పర్యటన నేపథ్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. వికారాబాద్ ఎస్ఏపి కళాశాల నుండి అనంతగిరిగుట్ట హరితా రిసార్ట్స్ వరకు భద్రత కట్టుదిట్టం చేశారు. ముందుగా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హైదరాబాద్ చేరుకోగా, శంషాబాద్ విమానాశ్రయంలో సీఎం రేవంత్ రెడ్డి సాదరంగా స్వాగతం పలికారు. అనంతరం హెలికాప్టర్ ద్వారా వికారాబాద్‌కు చేరుకున్న ఆయనకు ఎస్ఏపి ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ హెలిప్యాడ్ వద్ద ఘన స్వాగతం లభించింది. తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి,వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్, రాష్ట్ర మంత్రులు, మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం అనన్య తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఎస్ఏపి కళాశాల ప్రాంగణంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ గౌడ్ అధ్యక్షతన కాంగ్రెస్ పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఆ తర్వాత హరిత రిసార్ట్స్
సమావేశానికి రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, కేసీ వేణు గోపాల్, ఏ ఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, టిపిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్, ఎఐసిసి కార్యదర్శి సచిన్ సావంత్ హాజరయ్యారు. రాష్ట్ర రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు జరిగాయి. పది రోజుల పాటు కొనసాగిన ఈ శిబిరంలో పార్టీ క్షేత్రస్థాయిలో బలోపేతం నాయకత్వ సామర్థ్యాల అభివృద్ధి వ్యూహ రచన తదితర అంశాలపై సమగ్రంగా చర్చలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన డిసిసి అధ్యక్షులు తమ తమ జిల్లాల రాజకీయ పరిస్థితులు క్షేత్ర స్థాయి నిర్మాణాలు ప్రజా సమస్యల అంశాలపై విశ్లేషిస్తూ అనుభవాలను పంచుకున్నారు.
డీసీసీ అధ్యక్షులకు దిశానిర్దేశం చేశారు. పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయి నుంచి సమన్వయం పెంపు, ప్రజా సమస్యలపై కట్టు బాటు అవసరమని సూచించారు. శిక్షణా శిబిరానికి మంత్రులు హాజరు కావద్దని టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ ముందుగానే స్పష్టం చేయడంతో, సమావేశం అనంతరం మంత్రులు హైదరాబాద్‌కు బయల్దేరారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ డీసీసీ అధ్యక్షుల కుటుంబ సభ్యులతో రాహుల్ గాంధీ ప్రత్యేకంగా ఫోటోలు దిగారు. అనంతగిరి హిల్స్ ప్రాంతం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల రాకపోకలతో కిక్కిరిసిపోయింది. మొత్తంగా వికారాబాద్ పర్యటన కాంగ్రెస్ పార్టీలో నూతన ఉత్సాహాన్ని నింపిందని పార్టీ శ్రేణులు అభిప్రాయపడ్డాయి. వివిపిల రక్షణలో భాగంగా ఎన్ టి ఆర్ కూడలి నుండి రోడ్డును అనంతగిరి కొండ వరకు మూసి వేయడంతో జిల్లా ఆసుపత్రికి వెళ్లే రోగులు, కళాశాలల విద్యార్థులు, పలు కాలనీ ల ప్రజలు ఇబ్బంద్ది పడ్డారు. ఇంత భయమున్నా నాయకులు ప్రజలు నివసించే ప్రాంతాలకు ఎందుకు రావాలని ప్రశ్నించారు.

# "హాఫీజ్ పాషాపై దుష్ప్రచారాలకు కోర్టు శాశ్వత చెక్ సంచలన తీర్పుతో శిష్యుల ఆనందం"

**కరపత్రం ప్రతినిధి / ఎస్. పి.ఎస్.ఆర్ నెల్లూరు జిల్లా**

**"రెహ్మతాబాద్ దర్గా పీఠాధిపతి హజ్రత్ షా గులాం నక్షుంద్ హాఫీజ్ పాషా గారికి అనుకూలంగా నెల్లూరు కోర్టు ఉత్తర్వులు అప్తులు, భక్తులు హర్షం వ్యక్తం"**



శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, అనుమసముద్రంపేట మండలం రహ్మతాబాద్ గ్రామంలో వెలసిన చారిత్రాత్మక దర్గా రహ్మతాబాద్ షరీఫ్ 250 సంవత్సరాలకుపైగా ఆధ్యాత్మిక చరిత్రను మరియు వారసత్వాన్ని కూడా కలిగి ఉంది. ఈ పవిత్ర దర్గాలో మహనీయ సూఫీ సంతులు హజ్రత్ ఖ్వాజా రహ్మతుల్లా నాయబ్ ఏ రసూల్ (రహ్మతుల్లాహి తఆలా అలైహ్) మరియు హజ్రత్ సయ్యిదా మా హబీబున్నిసా ఖాతూన్ "అమ్మాజాన్" (రహ్మతుల్లాహి తఆలా అలైహ్) వారి పవిత్ర మజార్లు వెలసి ఉన్నాయి.రెండు తెలుగు రాష్ట్రాలే కాకుండా దేశ విదేశాల నుండి కూడా నిత్యం ఇక్కడ వేలాది మంది భక్తులు సూఫీ వార్ల ఆశీర్వాదాల కోసం ఈ దర్గాను సందర్శిస్తుంటారు. ఈ దర్గా యొక్క వారస సజ్జాదానషీన్‌గా సేవలందిస్తున్న హజ్రత్ షా గులాం నక్షుంద్ హాఫీజ్ పాషా గారు ఆధ్యాత్మిక గురువుగా అనేక రాష్ట్రాలలో శిష్యులను కలిగి ఉన్నారు. ఇటీవలి కాలంలో కొన్ని సోషల్ మీడియా వేదికలు, ముఖ్యంగా "హాక్ మీడియా హౌస్ "అనే సోషల్ మీడియా ఛానెల్‌తో పాటు మరికొన్ని యూట్యూబ్, ఫేస్‌బుక్ ప్లాట్‌ఫామ్‌లు కేసు విచారణలో ఉన్న సమయంలోనే హాఫీజ్ పాషా గారిని దోషిగా చిత్రీకరిస్తూ ప్రచారాలు నిర్వహించాయి. ఈ నేపథ్యంలో హాఫీజ్ పాషా గారు నెల్లూరు జిల్లా నాలుగవ అదనపు జిల్లా న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, గౌరవనీయ కోర్టు ఓ.ఎస్.నెం.8/2025 (తేదీ: 17-02-2026)లో శాశ్వత ఇంజంక్షన్ ఉత్తర్వులు జారీ చేసింది. కోర్టులో విచారణలో ఉన్న కేసులో ముందుగానే దోషిగా ప్రచారం చేయడం చట్టవిరుద్ధమని,సోషల్ మీడియాలో ఒక వ్యక్తి ప్రతిష్టను దెబ్బతీసే ప్రచారాలు నిషేధించబడినవని,ప్రతి వ్యక్తికి కోర్టు తుది తీర్పు వచ్చే వరకు నిర్దోషిత్వ హక్కు ఉందనీ కోర్టు తెలిపింది. ఈ ఉత్తర్వుల పై హాఫీజ్ పాషా గారి శిష్యులు,అప్తులు, హజ్రత్ ఖాజా రెహ్మతుల్లా నాయబ్ ఎ రసూల్ వారి భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వచ్చిన అసత్య ప్రచారాల వల్ల వారు తీవ్ర ఆవేదనకు గురయ్యారని, తమ ఆధ్యాత్మిక గురువుపై జరిగిన దుష్ప్రచారాలు చూసి మనోవేదన చెందామని తెలిపారు. "సత్యం ఎప్పటికైనా వెలుగులోకి వస్తుందనీ... న్యాయం ఎప్పటికైనా గెలుస్తుందనీ" భక్తులు భావోద్వేగంతో పేర్కొన్నారు. కోర్టు ఇచ్చిన ఈ ఉత్తర్వులు వారికి ధైర్యం, నమ్మకం, గౌరవాన్ని తిరిగి తీసుకొచ్చాయని తెలిపారు.హాఫీజ్ పాషా గారు ఎల్లప్పుడూ న్యాయవ్యవస్థపై సంపూర్ణ విశ్వాసం ఉంచుతరని, చట్టపరమైన మార్గంలోనే ముందుకు సాగుతున్నారని ఆయన అప్తులు పేర్కొన్నారు. దర్గా రహ్మతాబాద్ షరీఫ్ శాంతి, సహనం, సౌభ్రాతృత్వం, ఆధ్యాత్మిక విలువల ప్రతీకగా అని అదే విధానంలో హాఫీజ్ పాషా గారు కూడా నడుస్తారని, ఎలాంటి దుష్ప్రచారాలు ఆ విలువలను దెబ్బతీయలేవని స్పష్టం చేశారు.కోర్టు ఉత్తర్వులను గౌరవిస్తూ సోషల్ మీడియా వేదికలప బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, అసత్య ప్రచారాలకు దూరంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సత్యం... సహనం... న్యాయం -- ఇవే సూఫీ మార్గం అని చట్టం ముందు ప్రతి ఒక్కరూ సమానమే హాఫీజ్ పాషా గారి శిష్యులు ఆప్తులు చెప్పారు.

# కాంగ్రెస్ అంటేనే కన్నింగ్ కింగ్స్ గుంపు

**- చాచా ఓట్ చోరీ - పోత్ర రాహుల్ 420**
**- ఉత్తర భారత్ ఉడుచుకు తిన్నర్ - దక్షిణ దేశాన్ని దోచుకుంటున్నర్ రేవంత్ హామీలు గాలికి - తెలంగాణ సంఘధ ఖాన్ లకి**
**- వికారాబాద్ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మాధవి**

**కరపత్రం ప్రతినిధి వికారాబాద్, మార్చి:2,**
కాంగ్రెస్ పార్టీ అంటేనే కన్నింగ్ దొరల (కింగ్స్) గుంపు అని, భారతదేశానికి స్వాతంత్రం వచ్చిన తర్వాత మొదటి ఎన్నికల్లో చాచా నెహ్రూ ఓట్ చోరీకి పాల్పడితే, మనుమడు (పోత్ర) రాహుల్ గాంధీ ఎన్నికల్లో గెలిచేందుకు 420 హామీలు కామారెడ్డి, నిజాంబాద్ ప్రజల సాక్షిగా ప్రమాణం చేసినాడని భారతీయ జనతాపార్టీ వికారాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. మాధవి ఆరోపించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులకు శిక్షణ శిభిరం ముగింపు సమావేశానికి ప్రతిపక్ష నాయకుడు రాహుల్ వచ్చిన సందర్బంగా బీజేపీ పార్టీ నాయకులను చట్ట విరుద్ధంగా అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ లో బంధించిందాన్ని ఆమె తప్పు పట్టారు. ప్రజలు ప్రయోజకులు కాకుండా, ఆర్థికంగా ఎదగకుండా కుట్రలు చేసి, బానిసలుగా



మార్చుకొని మొసలి కన్నీళ్లు కారుస్తూ 70 సంవత్సరాలు గా ఉత్తర భారత్ ను ఉడుచుకు తిన్నర్, అక్కడ ఎగేసి ఓడిస్తే, దక్షిణ దేశాన్ని దోచుకు తినేందుకు రాగోల గద్దలుగా అంతగిరి కొండపై వాలినరాని ఆరోపించారు. ఓట్ల కోసం అధికారం కోసం పగటి వేషాలు వేసే తెలంగాణ కాంగ్రెస్ నాయకులు ముస్లిమ్స్ పండగలు ఇఫ్తార్, క్రిస్టియన్స్ కు గిఫ్టులు ఇవ్వడాన్ని హిందువులు నిషితంగా గమనిస్తున్నారని వచ్చే ఎన్నికల్లో కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీకి గోరి కట్టడం కాయమన్నారు. బీజేపీ నాయకులను అక్రమంగా అరెస్టు చేసినందుకు పోలీసులు భౌవిషత్ లో మూల్యం చెల్లుంచుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

# రోజూ రెండు లవంగాలు

**- అద్భుత ఆరోగ్య ప్రయోజనాలు**

**గజెల్లి రాజేంద్రప్రసాద్, సోషల్ అనలిస్ట్**
ఆయుర్వేద నిపుణుల ప్రకారం రోజూ రెండు లవంగాలు నమిలితే జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది, గ్యాస్, ఎసిడిటీ వంటి సమస్యలు తగ్గుతాయి. లవంగాలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, యాంటీబ్యాక్టీరియల్ గుణాలు రోగనిరోధక శక్తిని



పెంచి, సీజనల్ జ్వరాల నుండి రక్షిస్తాయి. యుజినాల్ అనే పదార్థం పంటి నొప్పులను తగ్గించి, నోటి దుర్వాసనను నివారిస్తుంది. బరువు తగ్గడంలో, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో కూడా లవంగాలు సహాయపడతాయి. అయితే, రోజుకు ఒకటి లేదా రెండు లవంగాలు మాత్రమే తీసుకోవాలని, గర్భిణీలు, మందులు వాడుతున్నవారు వైద్యుడిని సంప్రదించాలని సూచించారు.

## పెరిక కుల నూతన జిల్లా కమిటీ ఎన్నికలు

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పెరిక కుల సర్వసభ్య సమావేశం చెంగిచెర్లలోని కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. తెలంగాణ రాష్ట్ర పెరిక కుల సంఘం కమిటీ సమక్షంలో జరిగిన ఈ సమావేశంలో, నూతన జిల్లా కమిటీ ఎన్నికలు జరిగాయి. చింతం రాజేశ్వర్ జిల్లా నూతన అధ్యక్షుడిగా, చింతం గిరి వర్మ ప్రధాన కార్యదర్శిగా, కొమిరిశెట్టి శ్రవణ్ ఉపాధ్యక్షుడిగా, సోమసాని రాజ్ కుమార్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, మంచాల నవీన్ రాజా కోశాధికారిగా, అంకతి రాజమౌళి, గోదాసు ఉమేష్ కార్యదర్శులుగా, అంకతి రవి వర్మ యువజన విభాగం అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు సోమసాని రమేష్ ఆధ్వర్యంలో జరిగాయి.

## లోన్ యాప్ వేధింపులు

» ఆటో డ్రైవర్ ఆత్మహత్య




**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా ఘట్కేసర్ లో లోన్ యాప్ ఏజెంట్ల వేధింపులు భరించలేక ఆటో డ్రైవర్ సాయికుమార్ ఆత్మహత్య చేసుకున్నారు. భార్య పేరుతో తీసుకున్న అప్పును సకాలంలో చెల్లించలేదని, ఆమె ఫోటోలను సోషల్ మీడియాలో పెడతామని ఏజెంట్లు బెదిరించడంతో మనస్తాపానికి గురైన సాయికుమార్ ఉరివేసుకుని ప్రాణాలు వదిలారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ గా హెచ్ఎం స్పందన బాధ్యతల స్వీకరణ



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ మోహన్ పదవీ విరమణతో, జగిత్యాల మున్సిపల్ కమిషనర్ గా ఉన్న హెచ్ఎం స్పందన గారికి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఊ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ హైదరాబాద్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శ్రీమతి హెచ్ఎం స్పందన మెట్ పల్లి మున్సిపల్ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సంఘటన జగిత్యాల జిల్లా, కోరుట్ల ప్రాంతంలో జరిగింది.

## ఎమ్మెల్సీ అంజిరెడ్డిని కలిసిన బీజేపీ నేతలు



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
కోరుట్ల ప్రాంతానికి చెందిన బీజేపీ మల్లాపూర్ అధ్యక్షుడు, ఉమ్మడి కరీంనగర్, అదిలాబాద్, మెదక్, నిజామాబాద్ ఎమ్మెల్సీ చిన్నమలై అంజిరెడ్డిని హైదరాబాదులో వారి నివాసంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. మల్లాపూర్ మండలంలోని అనారోగ్యంతో బాధపడుతున్న వారి సీఎం రిలీఫ్ ఫండ్ దరఖాస్తులను వారికి అందజేశారు. గొర్రె పెల్లి, గుండంపెల్లి, మొగిలిపేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలకు ఎమ్మెల్సీ నిధుల నుండి గదులు, మరుగుదొడ్ల నిర్మాణం కోసం నిధులు కేటాయించాలని కోరారు. దీనికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి సానుకూలంగా స్పందించి, తప్పకుండా చేస్తామని హామీ ఇచ్చారు.

## మెట్టుపల్లి ఆర్డివోగా నరసింహారావు



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
మెట్పల్లి డివిజన్ ఆర్డీవోగా జి. నరసింహరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని, ప్రజలకు పారదర్శకమైన, వేగవంతమైన సేవలు అందించాలని, రెవెన్యూ సమస్యలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.

## మెట్టుపల్లిలో బీరప్ప బోరు ప్రారంభించిన జెట్టి లింగం



**గాజంగి మహేశ్వర్, కరపత్రం మెట్టుపల్లి**
జగిత్యాల జిల్లా మెట్పల్లి పట్టణంలోని బ్రూక్లిన్ స్కూల్ వద్ద గల బీరప్ప కళ్యాణ మహోత్సవానికి మెట్పల్లి పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం, కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా, బీరప్ప గుడికి శాంక్షన్ చేయించిన నూతన బోరును మెట్పల్లి పట్టణ అధ్యక్షులు జెట్టి లింగం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సాయి రెడ్డి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు పుల్లూరి వెంకటేష్, బొడ్ల ఆనంద్, కురుమ సంఘం అధ్యక్షులు, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆరోగ్య ఉసిరి ...



ఈ మధ్య కాలంలో తరచూ జలుబు, దగ్గు, గొంతు మంట, శరీర బలహీనత వంటి సమస్యలు చాలామందిలో కనిపిస్తున్నాయి. ఉసిరిలో ఉన్న విటమిన్ 'సి' వల్ల రోగ నిరోధకశక్తి పెరుగుతుంది. శరీరం వైరస్‌లను ఎదుర్కొనే సామర్థ్యం మెరుగవుతుంది. రక్తంలో షుగర్ ఒక్కసారిగా పెరగకుండా సహాయపడుతుంది. అజీర్ణం తగ్గుతుంది. ఉసిరిలో ఫైబర్, ఆంటీఆక్సిడెంట్స్, శరీరంలోని వాపును తగ్గిస్తాయి. అందుకే ఉసిరిని ఆహారంలో భాగం చేసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మరి ఉసిరితో ఏమేమి వంటలు చేసుకోవచ్చో తెలుసుకుందాం.



### వేపుడు

కావలసినవి : పెద్ద ఉసిరికాయ ముక్కలు- 2 కప్పులు, కారం- స్పూన్, ఉప్పు- తగినంత, పసుపు- స్పూన్, జీలకర్ర- స్పూన్, వెల్లుల్లి- 4 రెబ్బలు, నూనె- రెండు స్పూన్లు.

తయారీ : ముక్కల్ని తొనలుగా కోసుకోవాలి. పాన్‌లో నూనె వేడిచేసి జీలకర్ర, వెల్లుల్లి వేయాలి. సువాసన రాగానే ఉసిరికాయ ముక్కలు వేసి, బాగా కలపాలి. ఉప్పు, పసుపు వేసి మూతపెట్టి వేయించాలి. చివరగా కాస్త క్రిస్పీగా అయ్యాక కారం వేసి, నిమిషం వేయించి, దించాలి. ఈ వేపుడు పప్పు, చారు, రసంలో సైడ్ డిష్‌గా బాగుంటుంది. పెరుగు అన్నంలో ఇంకా అద్భుతంగా ఉంటుంది.

### రైస్



కావలసినవి: ఉడికించిన అన్నం- 3 కప్పులు, ఉసిరికాయలు- 5, పచ్చిమిర్చి- 3, ఎండుమిర్చి- 2, కరివేపాకు- రెమ్మ, పసుపు- 1/2 స్పూన్, ఉప్పు- తగినంత, శనగపప్పు- స్పూన్, మినపప్పు- స్పూన్, వేరుశెనగ- 2 స్పూన్లు, ఆవాలు-1/2 స్పూన్, జీలకర్ర- 1/2 స్పూన్, ఇంగువ- స్పూన్లు.

తయారీ: ఉసిరికాయలను బాగా కడిగి, గింజ తీసి, తురుముకోవాలి. పోపు కోసం పాన్‌లో నూనె పోసి, పొయ్యి మీద పెట్టాలి. వేడయ్యాక ఆవాలు, జీలకర్ర, శనగపప్పు, మినప్పప్పు, వేరుశనగ పప్పు వేయాలి. ఇవన్నీ బంగారురంగు వచ్చేంత వరకు వేయించాలి. తర్వాత మిర్చి, కరివేపాకు, ఎండుమిర్చి వేయించాలి. ఉసిరికాయ తురుము వేయాలి. ఇప్పుడు ఉసిరి తురుము వేసి కలపాలి. వెంటనే పసుపు, ఉప్పు వేసి రెండు నిమిషాలు వేయించాలి. పచ్చి వాసనపోయాక అన్నం వేసి కలపాలి. ఇంతే.. ఉసిరికాయ రైస్ రెడీ !

### తొక్కు పచ్చడి



కావాల్సినవి: ఉసిరికాయలు-10, ఎండుమిర్చి- 8, మెంతులు-1/2 స్పూన్, ఆవాలు- స్పూన్, జీలకర్ర-1/2 స్పూన్, వెల్లుల్లి రెబ్బలు-6, ఉప్పు- అవసరానికి తగినంత, పసుపు- 1/2 స్పూన్, నూనె- 3 స్పూన్లు, పోపు కోసం ఆవాలు- 1/2 స్పూన్, మినపప్పు- స్పూన్, కరివేపాకు- రెమ్మ.

తయారీ : ఉసిరికాయలను బాగా కడిగి తుడి చేసి, చిన్న ముక్కలుగా కోసి పక్కన పెట్టుకోవాలి (గింజను వేరుగా తీసేయాలి). ఒక పాన్‌లో స్పూన్ నూనె వేసి వేడిచేయాలి. మెంతులు, ఆవాలు, ఎండుమిర్చి వేసి సువాసన వచ్చేంత వరకూ తక్కువ మంట మీద వేయించాలి. మెంతులు మాడకుండా చూసుకోవాలి. ఈ పదార్థాలు చల్లారాక, మిక్సీలో వేసి పొడిలా చేసుకోవాలి. అదే పాన్‌లో మిగతా నూనె వేసి ఉసిరి ముక్కలను వేసి, ఐదు నిమిషాలు వేపాలి. పసుపు, ఉప్పు వేసి కలపాలి. ఉసిరి ముక్కలు కొద్దిగా మెత్తగా వేగాక తీసి పక్కనపెట్టుకోవాలి. వేపిన ఉసిరి ముక్కలు, ముందుగా చేసిన మసాలా పొడి మిక్సీలో వేసి, చిన్నగా తరిగిన వెల్లుల్లి కూడా వేసి గ్రైండ్ చేయాలి. పచ్చడి మరీ గట్టిగా ఉంటేనే నిల్వ ఉంటుంది. పోపు కోసం ఒక చిన్న పాన్‌లో నూనె వేసి, వేడయ్యాక ఆవాలు, మినప్పప్పు, కరివేపాకు, ఎండుమిర్చి వేసి వేయించి పచ్చడిలో పోయాలి. ఇంతే..ఉసిరికాయ పచ్చడి రెడీ!.



### స్వీట్

కావాల్సినవి: ఉసిరి- 10 నుంచి 12, బెల్లం- కప్పు, యాలకుల పొడి- చిటికెడు, నెయ్యి- స్పూన్.

తయారీ: ఉసిరిని శుభ్రంగా కడిగి ముక్కలుగా చేసి, విత్తనాలు తీసేయాలి. ముక్కలను కొద్దిగా ఉడికించాలి. తర్వాత బెల్లం పాకం చేసి, అందులో ఉసిరి ముక్కలు వేసి మరిగించాలి. చివరగా యాలకుల పొడి చల్లి, దించాలి. ఉసిరి పుల్లగా ఉంటుందనే కారణంతో చాలామంది దూరంగా పెడతారు. కానీ ఉసిరితో చేసే ఈ స్వీట్ మాత్రం చిన్నపిల్లలకూ నచ్చేలా ఉంటుంది.




## దలాల్ స్ట్రీట్‌లో ట్రంప్ యుద్ధోన్మాద కల్లోలం

## రూ.6.5 లక్షల కోట్ల సంపద హుష్‌కాకి సెన్సెక్స్ వెయ్యి పాయింట్లకు పైగా



ముంబయి : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ యుద్ధోన్మాద చర్యలు దలాల్ స్ట్రీట్‌లో కల్లోలం సృష్టించాయి. మధ్యప్రాచ్యంలో ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరడంతో భారత స్టాక్ మార్కెట్లు భారీ నష్టాలను మూటగట్టుకున్నాయి. వారాంతంలో అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడుల్లో ఇరాన్ అత్యున్నత నాయకుడు అయతుల్లా అలీ ఖమేనీ మరణించారనే వార్త ఇన్వెస్టర్లలో తీవ్ర భయాందోళనలు రేకెత్తించింది. ఈ ఉద్రిక్తతలు మరింత పెరగొచ్చనే ఆందోళనల్లో సోమవారం బిఎస్‌ఇ సెన్సెక్స్ 1,048 పాయింట్లు లేదా 1.29 శాతం క్షీణించి 80,239కు పరిమితమయ్యింది. ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 313 పాయింట్లు లేదా 1.24 శాతం నష్టపోయి 24,866 వద్ద ముగిసింది. ఇంతక్రితం సెషన్‌తో పోల్చితే బిఎస్‌ఇ 2700 పాయింట్లు పతనమై.. ఓ దశలో 78,543 కనిష్ట స్థాయిని తాకింది. ఈ ఒక్కరోజే బిఎస్‌ఇలో లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.6.5 లక్షల కోట్లు హరించుకుపోయి రూ.457 లక్షల కోట్లకు పడిపోయింది. నిఫ్టీలో మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 1.58 శాతం, 1.75 శాతం చొప్పున క్షీణించాయి. సెన్సెక్స్-30లో కేవలం బిఇఎల్ 2.09 శాతం, సన్‌ఫార్మా 0.84 శాతం, ఐటిసి 0.38 శాతం చొప్పున పెరగ్గా.. మిగితా 27 స్టాక్స్ నష్టాలను చవి చూశాయి. వరుస అమ్మకాల ఒత్తిడితో మార్కెట్లు ఆరు నెలల కనిష్ట స్థాయికి క్షీణించాయి.

యుద్ధ వాతావరణం కారణంగా ప్రపంచ చమురు సరఫరాకు ఆటంకం కలుగుతుందనే భయంతో చమురు రంగ షేర్లు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు వరుసగా అమ్మకాలకు మొగ్గు చూపడం మార్కెట్ సెంటిమెంట్‌ను మరింత దెబ్బతీసింది. రంగాల వారీగా చూస్తే ఆటోమొబైల్, కన్స్యూమర్ డ్యూరబుల్స్ రంగాలు 2 శాతం కంటే ఎక్కువ నష్టపోయాయి. ముఖ్యంగా ఇండిగో, ఎల్ అండ్ టి, అదానీ పోర్ట్స్ వంటి దిగ్గజ షేర్లు 3-6 శాతం వరకు పతనమయ్యాయి. ఇన్వెస్టర్లు యుద్ధ పరిణామాలను గమనిస్తూ నాణ్యమైన బ్యాంకింగ్, ఆటోమొబైల్, డిఫెన్స్ రంగ షేర్లను నెమ్మదిగా కొనుగోలు చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. మిగితా స్టాక్స్ పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నారు. ఇప్పట్లో మార్కెట్లలో స్థిరత్వం రాకపోవచ్చని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.